సేంద్రియ సాగుకు పదపద

- చీడపీడల నివారణకు మంచి మార్గం
- ఆసక్తి చూపుతున్న రైతన్నలు


పొలాలకు ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశువుల పేడ

బిక్కవోలు: అధిక రసాయన ఎరువుల వినియోగం ఎప్పుడూ అనర్థమే.. ఆ ఉత్పత్తులు అనారోగ్య కారకమే.. భూమిని నిస్సారం చేసే ఉత్పారకమే.. అందుకే సేంద్రియ ఎరువుల సాగుపై పుడమి పుత్రుల ఆసక్తి మళ్లింది.. ఈ పంట ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు పంట కాలంలో చీడపీడల నివారణ సాధ్యమవుతోంది. రసాయన ఎరువుల వినియోగంతో భూమి నిస్సారం కాగా, అదే సేంద్రియ విధానంలో భూమి మరింత ఉత్తేజంగా మారుతోంది. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు ఉన్నారు. అనపర్తి మండలంలో 9,560, బిక్కవోలులో 14,978, పెదపూడిలో 17,890, రంగంపేటలో 6,670 ఎకరాల్లో వరి సాగుకు రైతన్నలు సన్నద్ధం అవుతున్నారు. ఇందులో ఎక్కువ మంది సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువులు కలిపి వాడుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలకు అనుగుణంగా పశువుల పెంటతో పాటు పచ్చిరొట్ట పైర్ల ద్వారా భూసారాన్ని పెంచుకుంటున్నారు. సాధారణంగా పంటలకు ఉపయోగపడే పోషకాలు నేలలో ఉంటాయి. ఏటా పంటలు పండించడంతో పోషకాలు తరిగిపోతుంటాయి. నేలలో పోషకాలు పెంచుతూ, అధిక దిగుబడులు పొందాలంటే పశువుల పేడ, వర్మికంపోస్టు, బయోగ్యాస్ ప్లాంట్ల వ్యర్థాలు, చెరువు కుంటల్లోని పూడిక మట్టి, పచ్చిరొట్ట వంటివి వినియోగించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తద్వారా పంట ఉత్పత్తులు ఆశాజనకంగా వస్తాయని వివరిస్తున్నారు. తరచూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి పంటలకు చీడపీడలు సోకి పంట దిగుబడులు తగ్గిపోయి నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఇచ్చే సేంద్రియ ఎరువులను ముందుగా పొలాల్లో వేసి కలియ దున్నుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

సేంద్రియ ఎరువులతో పొలాలు సారవంతం అవుతాయి. పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయి. ఈ ఎరువుల వినియోగంతో భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోవు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరల్లో ఉంటే నీటిని మొక్కలకు అందేలా చేస్తాయి. వివిధ రకాల రసాయన ఎరువులతో కలిగిన సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకంతో పరిష్కరించుకోవచ్చు. నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాలు సూక్ష్మ జీవులుంటాయి. ఈ సూక్ష్మ జీవులు వృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగపడతాయి. వీటి వాడకంతో పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. నాణ్యమైన దిగుబడులు వస్తాయి. సేంద్రియ ఎరువుల్లో అధిక పోషకాలు ఉంటాయి. పశువుల పేడ నుంచి నత్రజని 0.5 నుంచి 15 శాతం, భాస్వరం 0.3 నుంచి 0.9 శాతం, పొటాష్ 0.5 నుంచి 1.9 శాతం భూమికి అందుతుంది. అలాగే వర్మికంపోస్టులో నత్రజని 1.6 శాతం, భాస్వరం 0.5 శాతం, పొటాష్ 0.8 శాతం లభిస్తున్నందున రసాయన ఎరువులను తగ్గించి వాడుకోవచ్చు. వీటిని వినియోగించడం వల్ల అధిక దిగుబడులు వచ్చి రైతులకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.

ఈ విధానం.. లాభదాయకం



సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. పంట పెట్టుబడులు గణనీయంగా తగ్గుతాయి. పంటలకు తెగుళ్ల బెడద ఉండదు. నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చు. దిగుబడులు ఆశాజనకంగా ఉండి లాభాలు పొందవచ్చు. ఈ విధానం ఎంతో లాభదాయకం.

– శామ్యూల్ జాన్, ఏఓ, బిక్కవోలు

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని వినాయక వెంకట సాయి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 వరకూ కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. వీటిలో భాగంగా 17న స్వామివారికి అభిషేకాలు, 18వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, 19వ తేదీ రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం, 20వ తేదీన అన్నసమారాధన, 21న పుష్పోత్సవం జరుగుతాయి. అలాగే ఉత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీన సుమారు 40 మంది భక్తులు స్వామివారి మాలధారణ చేశారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: కూనవరానికి చెందిన నేళ్ల సువర్ణ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్నం వేధింపులపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కూనవరానికి చెందిన సువర్ణ జ్యోతికి అదే గ్రామానికి చెందిన మేనత్త కుమారుడు బాలాజీతో 2014లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే జ్యోతిని భర్త బాలాజీ, అత్త అలివేలు మంగ కట్నం కోసం మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

క్లుప్తంగా

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకాలు


సంపరలో విజయదుర్గమ్మ వారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి జ్యేష్ఠ మాసం శుక్రవారం సందర్భంగా పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయ దుర్గాంబిక ఆలయంలో పూజలు


రంగంపేటలో విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన శ్రీవిజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్

మధురపూడి: టీడీపీ పాలనలోనే రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ అన్నారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు మంచి మెజార్టీ ఇచ్చారన్నారు. చారిత్రాత్మక పనులు టీడీపీ పాలనలో జరిగాయన్నారు.

కౌంటర్ దాఖలు చేయాలని నోటీసు

సీతానగరం: నల్గొండ పంచాయతీ పరిధిలో కొండను అక్రమంగా తవ్వకాలు జరపడంపై వచ్చే నెల 8న కౌంటర్ దాఖలు చేయాలని ఎన్జీటీ నోటీసులు జారీ చేసిందని చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ చిడిపి నకుల సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పర్యావరణంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏఎంఓ గౌరీ శంకర్

సీతానగరం: పర్యావరణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) గౌరీ శంకర్ అన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏఎంఓ గౌరీ శంకర్, ఎంఈఓ కె.స్వామినాయక్, హెచ్ఎం కె.సతీష్ బాబు పాల్గొన్నారు. గౌరీ శంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఎంఈఓ స్వామినాయక్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 వరకు పాఠశాలల్లో పలు అంశాలపై షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామం పరిధిలో శుక్రవారం ఉపాధి పని చేస్తున్న నాకరపు వెంకటలక్ష్మిని పాము కాటు వేసింది. వెంటనే ఆమెను కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఎంపీడీఓ జి.రాజ్ మనోజ్ వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

కుండపోత వర్షం



చంద్రేడులో వర్షానికి ముందు కమ్ముకున్న కారుమబ్బులు

రంగంపేట: ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకున్న వేళ.. ఉరుములు, మెరుపులతో దద్దరిల్లింది.. రెండు రోజుల నుంచి ఉక్కబోతకు అల్లాడిన ప్రజలకు ఉపశమనం కలిగించింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచీ ఎండ లేకపోయినా తీవ్ర ఉక్కబోత అవస్థలకు గురిచేసింది. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఉదయం వివిధ పనులపై బయటకు వెళ్లిన ప్రజలు తిరిగివచ్చే సమయంలో వర్షానికి ఎక్కడివారు అక్కడే స్తంభించిపోయారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం వేసవి దుక్కులకు, వరి, పత్తి చేలు వేసే రైతులకు ఉపయోగపడనుంది. అదేవిధంగా పామాయిల్ మొక్క తోటలకు, కూరగాయ పంటలకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

చల్లబడిన వాతావరణం

రాజానగరం: వేసవి ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న వేళ శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. సుమారు గంటన్నరపాటు కుంభవృష్టిగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించింది. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఖరీఫ్ సాగుకు అనుకూలం

ఖరీఫ్ సాగులో నిమగ్నమై ఉన్న రైతన్నలకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుంది. గంటన్నర సమయం ఏకధాటిగా కురిసిన వర్షంతో పొలాలలో నీరు నిలిచిపోయింది. ఇది ఆయా పొలాలను దుక్కి చేసుకునేందుకు, నారుమడులు చదును చేసుకునేందుకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. అలాగ పండ్ల తోటలకూ వర్షం మంచి చేసింది.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

రాజానగరం: పంట దిగుబడులు బాగుండాలంటే విత్తన శుద్ధి తప్పక చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని కలచవర్లలో ఖరీఫ్ వరి పంట సాగును శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే వేసివున్న నారుమడులను కూడా పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై విత్తన శుద్ధి అవసరాన్ని తెలియజేశారు. ఒక కిలో విత్తనాలను కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ 2 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి శుద్ధి చేయాలన్నారు. అలాగే ఒక ఎకరానికి సరిపడే ఐదు సెంట్లలో విత్తనం చల్లే ముందు నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను 14 రోజుల ముందుగానే దుక్కిలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డీఆర్‌సీ ఏడీఏ జయలక్ష్మి, ఏడీఏ డి.శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం, విస్తరణాధికారి ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మూడు ఆవుల మృతి


మృతి చెందిన ఆవు

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులకు చెందిన మూడు ఆవులు మృతి చెందాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో వల్లభశెట్టి సత్యనారాయణకు చెందిన రెండు ఆవులు, ముప్పిడి పెద్దలుకు చెందిన ఒక ఆవు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. అయితే వీటికి బీమా చేయించినట్టుగా ట్యాగ్‌లు ఉన్నాగాని, ప్రస్తుతం అటువంటి పథకాలు అమలులో లేవంటూ సంబంధిత అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈదురుగాలి బీభత్సం

కడియం: మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలి బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచీ ఉక్కపోత ఇబ్బంది పెట్టింది. రాత్రి ఏడు గంటల సమయానికి కారు మబ్బులు కమ్మేశాయి. మెల్లగా మొదలైన ఈదురు గాలి దాదాపు గంటకుపైగా హడావుడి చేసింది. అనంతరం వర్షం ప్రారంభమైంది. దీంతో ఎక్కడికక్కడే జనం స్తంభించింది. మండలంలోని పలు గ్రామాల్లో విస్తరించి ఉన్న నర్సరీల్లో పెద్ద సైజు మొక్కలు నేలనంటాయి. ఈదురు గాలితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎండ ప్రతాపం, ఉక్కపోతలు సతమతం చేసినప్పటికీ, రాత్రికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈదురు గాలి మాత్రం ఆందోళన కలిగించింది.

గ్రామాల్లో ఇంటింటా సర్వే


రామేశ్వరంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ట్రైనీ మెడికోలు

పెదపూడి: రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో డాక్టర్ విద్యనభ్యసిస్తున్న మెడికోలు శుక్రవారం ఇంటింటా సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో ఒక్కో మెడికో విద్యార్థి ఐదు ఇళ్లను దత్తత తీసుకున్నారన్నారు. వారు దత్తత తీసుకున్న కుటుంబానికి ఐదు సంవత్సరాలపాటు అందుబాటులో ఉండి వారి ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనం చేస్తారన్నారు. ఇందులో భాగంగా మెడికోలు గ్రామంలో ఇంటింటా సర్వే చేసి ఆరోగ్య పరిస్థితులపై అధ్యయనం చేశారు. అలాగే అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నేత్రాలను సంరక్షించుకోవాలి


కోటపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: ప్రతి ఒక్కరూ నేత్రాలను సంరక్షించుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రంగంపేట సబ్జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు, సేవా సమితి కన్వీనర్లు కందర్ప వెంకట అమర్‌నాథ్, తిక్కిశెట్టి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కోటపాడు, ఈలకొలను గ్రామాల్లోని సత్యసాయి మందిరాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కన్నా నేత్రాలు ప్రధానమైనవని, వీటి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోటపాడులో 100 మందికి, ఈలకొలనులో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 14 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. 57 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని పుట్టపర్తి సేవల జిల్లా ఇన్‌చార్జి తిక్కిశెట్టి గోవిందరాజులు తెలిపారు. ఈ శిబిరంలో రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రి, వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయ డాక్టర్లు, సిబ్బంది సేవలందించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా యువజన విభాగ సమన్వయకర్త ఎస్.సాయి సుధాకర్, సేవాదళ్ సభ్యులు ప్రభావతి, మంగతాయారు, టి.సత్యనారాయణ, మణికంఠ, వీరసాయి, గంగాధర్, వెంకటేశ్వరరావు, సాయిగీత, లక్ష్మీనారాయణ, మాచరమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు పరిశీలించారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఆయన పాఠ్య పుస్తకాలను చూశారు. అడ్మిషన్లు జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులంతా మధ్యాహ్నం భోజనం తినేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి నారాయణ, పాఠశాల హెచ్ఎం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో దోమల నియంత్రణ

బిక్కవోలు: అవగాహనతోనే దోమలను నియంత్రించవచ్చని ఏఎన్ఎం బి.సత్యశ్రీరాణి అన్నారు. శుక్రవారం తొస్సిపూడి గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నిల్వ నీటి కారణంగా దోమలు పెరుగుతాయన్నారు. వీటిని నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతతో సాగాలన్నారు. ఆశ కార్యకర్తలు సుజాత, రాఘలత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తొస్సిపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం సత్యశ్రీరాణి

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేయాలి

- కార్యకర్తలకు అండగా నిలబడతాం
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం చేసే అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, అయితే కక్ష సాధింపు విధానాలు సరికాదన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరైనది కాదన్నారు. ఈ చర్యను సరిచేస్తూ ఆదిరెడ్డి అప్పారావు అక్కడ శిలాఫలకాన్ని పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ చూపిన చొరవ, కృషి అభినందనీయమన్నారు. గత టీడీపీ హయాంలో ఫ్లైఓవర్‌కు సంబంధించి పేపర్ వర్క్ జరిగి ఉండవచ్చని, భరత్‌రామ్ కృషితో 80 శాతం వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. వ్యక్తిగత ఆరోపణలు, దూషణలను పక్కన పెట్టి నగరంలో ఆరోగ్యకరమైన రాజకీయాలకు తెరలేపాలని సూచించారు. తమ పార్టీ ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటున్నామన్నారు. ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తామన్నారు. పార్టీని తిరిగి గాడిలో పెట్టేందుకు అన్ని విధాలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు. ఆదిరెడ్డి కుటుంబం అరెస్ట్ వెనుక మార్గాని భరత్‌రామ్ లేరన్నారు. నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ ఈవీఎంల విషయంలో మోసం జరిగిందని ప్రజలు అనుమానిస్తున్నారన్నారు. తాము వేసిన ఓట్లు ఎక్కడికి పోయాయని అడుగుతున్నారని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, పితాని లక్ష్మీకుమారి, కడలి వెంకటేశ్వరరావు, ఏవీ శ్రీనివాస్, పెంకె సురేష్, బిల్డర్ చిన్న పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం రేపు


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

పెదపూడి: పుట్టకొండలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి కల్యాణం ఈ నెల 16న ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే రాట మూహూర్తం చేశారు. కల్యాణం రోజున ఆదివారం ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేస్తారు. 10 గంటలకు కల్యాణ ఘట్టం ప్రారంభమవుతుంది. ఆలయ ప్రధాన అర్చకుడు పున్నమరాజు కమలాకర్ అధ్వర్యంలో పండితులు కల్యాణ క్రతువులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ తంతు పూర్తి చేశారు. అనంతరం 12.20 గంటలకు హోమం పూజలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణమూర్తులను ఊరేగిస్తారు. రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం చేస్తారు. గ్రామస్తుల సహకారంతో జరిగే కల్యాణ ఏర్పాట్లను ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ వల్లు సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

మంత్రి పదవి ఆశించా: ఎమ్మెల్యే గోరంట్ల


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: తాను ఈసారి మంత్రి పదవిని ఆశించానని, సుదీర్ఘ కాలంగా రాజకీయాలలో ఉన్న తాను అలా ఆశించడంలో తప్పులేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. గతంలో రూరల్‌లో రెవెన్యూ శాఖ భూములు కబ్జా చేసిందని, చాలా భూములు అన్యాక్రాంతం అయ్యాయని, దీనిపై జిల్లాలోని అధికారులపై విచారణ జరిపిస్తామన్నారు. గతంలో ఇబ్బందులు పెట్టి తప్పుడు కేసులు పెట్టిన వారిపై కచ్చితంగా వేటు తప్పదన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పర్యటన

ధవళేశ్వరం: గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద ఉన్న మురుగుకాలువ మళ్లింపు పథకం ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రాజమహేంద్రవరంలోని వరదనీటితో రామకృష్ణ నగర్, నేతాజీనగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాలు ముంపునకు గుర వుతున్నాయన్నారు. మురుగునీరు తోడేందుకు రూ.3.60 కోట్లతో 360 హార్స్‌పవర్ పంపులతో ప్రాజెక్టు మొదలైందన్నారు. రూరల్ నియోజక వర్గంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

కంబాలచెరువు: పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలని స్టేట్ ప్రాజెక్ట్ అధికారి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా జిల్లాలో కొందరు ఎంఈఓలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ ఉపాధ్యాయులనే పుస్తకాలను స్కూళ్లకు తీసుకెళ్లమని కొందరు ఎంఈవోలు అనడాన్ని ఖండించారు. జిల్లాలోని 19 మండలాలలో 14 మండలాల ఎంఈఓలు పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు సక్రమంగా చేర్చారని, నిడదవోలు, కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల ఎంఈఓలు మాత్రం ఉపాధ్యాయులే పాఠ్యపుస్తకాలను స్కూళ్లకు తీసుకెళ్లాలని అజమాయిషీ చేస్తున్నారన్నారు. పైగా ప్రభుత్వం నుంచి తమకింకా సొమ్ములు రాలేదని వచ్చిన వెంటనే ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను ఉపాధ్యాయులకు చెల్లిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు.